
# విరిగిన కాలు ఒరిగిన కుర్చీ




## సానికొమ్ము కృష్ణారెడ్డి

శ్రీనివాసరావు మామ వ్రాసిన ఉత్తరాన్ని అందుకున్నాడు. స్తబ్దంగావున్న అతని హృదయం మళ్ళీ కల్లోలించింది. ఘనీభవించుకొనివున్న వేదన కరిగి తిరిగి ప్రవాహమై సుళ్ళు తిరగటంవల్ల, అతడు శకుంతలను రమ్మని ఉత్తరం వ్రాశాడు.

సహజంగా మనిషి తన ఆప్తులను పిలిచి ఆనందాన్ని గురించి చెప్తాడా, బాధల్నిగురించి చెప్తాడా అంటే- బాధల్నిగురించే చెప్తాడంటారు కొందరు.

ఆనందాన్ని గురించే నంటారు కొందరు.

మనిషి తన దుఃఖాన్ని యితరులకు చెప్పి ఉపశమనం పొందాలని చూస్తాడని, తనలోని ఆనందాన్ని యితరులు గుర్తించుకోగలిగి ప్రకటిస్తే ఎక్కువ సంతోషిస్తాడని వోసారి శ్రీనివాసరావు అన్నాడు. అందువల్లనేమో హృదయం బాధతో బరువెక్కిపోగానే శకుంతలకు లేఖ వేశాడుగావును.

గుండెలో కన్నీరు జరజర ప్రాకినప్పుడు అతను శకుంతలకోసం వెతుకుతాడు- రోగి వైద్యుణ్ణి వెతుక్కున్నట్లు.

శకుంతల ఎవరూ?

ఎవరో పదేళ్ళక్రితం?

మగనాలి తొమ్మిదేళ్ళ క్రితంనుంచి.

అతడికి మంచిస్నేహితురాలు నాలుగేళ్ళను ంచి

ఆ స్నేహం ఇతరులకు అవగాహన కాదు. అందునా ఆడా మగా మధ్య ఫ్రండ్‌షిప్‌ను మన్నించేంతగా, యింకా ఎదగని లోకమిది.

అయినా ఆమె భయపడదు.

ధైర్యం ఆమె సొమ్ము.

ఆమెతో స్నేహం కూడా అవాంఛితంగానే లభించింది శ్రీనివాసరావుకు.

కాంతారావు అతనికి క్లాస్‌మేట్. అతడు పెండ్లికి శ్రీనివాసును పిలిచాడు.

పెళ్ళికి వెళ్ళాడు.

తీరా వెళ్తే పెళ్ళి ఆగిపోయింది. పిల్లతండ్రి పోలీసు బలగంతో వచ్చాడు.

"నా యిష్టం. నాకు నచ్చినవాణ్ణి పెళ్ళాడ్తా' నన్నది శకుంతల. అనటమేగాదు కోర్టుదాకా వెళ్ళి కూడా తన అభిమతాన్ని నెగ్గించుకుంది.

అప్పుడే శకుంతలతో నేస్తంకట్టాడు శ్రీనివాసరావు. ఆమె నచ్చింది.

ఆమెలోకూడ అతనిలో వున్నట్లే ఒక ప్రత్యేక వ్యక్తిత్వం ఉందనుకొన్నాడు. అతడూ తండ్రి తెచ్చిన సంబంధాన్ని కాదని అతనికి నచ్చిన సంబంధాన్ని సెటిల్ చేసుకొన్నాడు.

అత్యుత్యం ఆ స్నేహాన్ని నాటి, పెంచి పెద్ద చేసింది.

సుఖ దుఃఖాల విషయంలో తమతో సామ్యంగల వారితో మనిషికి ఆత్మీయత ఏర్పడి వృద్ధి అవుతుందనుకోడానికిఇదిఒక ఎగ్జాంపులు అనుకొందాం.

వసారాలో, కుర్చీలో కూర్చొని సిగరెట్ త్రాగుతూ ఎదురు చూస్తున్నాడు శకుంతల కోసం శ్రీనివాస్.

ఆ కుర్చీలో కూర్చొని అనేక పర్యాయాలు ఆమెకోసం ఎదురుచూశాడు. ఆ కుర్చీలో కూర్చొనే అనేకపర్యాయాలు అతని ఆవేదనని ఆమెహృదయం ముందు పిండి కుప్పపోసుకొని మనస్సు బరువును తగ్గించుకున్నాడు.

అప్పుడూ అదే ఆరాటంతో, అవసరంతో ఆ కుర్చీలోనుంచే ఎదురు చూస్తున్నాడు.

ఆ కుర్చీ వెనక కాళ్ళు రెండూ జాయింటు మేకులు పట్టుసడలి, లూజయిపోయి వెలుపలకు ఊడ్చుకొని పోయి లుక లుక మంటున్నాయి. ఆ కుర్చీ మార్చమన్నది క్రితం వచ్చినప్పుడు శకుంతల.

మార్చలేక పోయాడు. డబ్బులేదు మరి!

ఆ విషయం అప్పుడు గుర్తువచ్చి కుర్చీతీసి, వో మూలకు నెట్టి, మంచం వాల్చుకున్నాడు. శకుంతల రావచ్చు ననుకుంటూ కూర్చున్నాడు.

జేబులో పెట్టుకొన్న మామ వ్రాసిన ఉత్తరాన్ని ఒకసారి తడివి చూసుకున్నాడు.

"అదేంటి! మంచంలో కూర్చున్నారు. కుర్చీ మోటయిందా!" అంటూ ఇంట్లోనుంచి వసారా

లోకి తొంగి చూస్తూ శ్రీమతి కేకలు ప్రారంభించింది.

ఆమెకు భర్త మంచంలో కూర్చొనుంటే ఏదో తేలికభావం ఏర్పడ్డది గావాలు - కుర్చీలో వుంటే సింహాసనంలో వున్న రాజులాగా కనిపిస్తాడేమో! మంచంలో కూర్చొని వుండగా చూస్తే పూచి కోడు.

కుర్చీలో కూర్చోవటం మనిషికి ఏదో ఘనత నాపాదిస్తున్నట్లు మనిషీ భావించుతాము. ఆ ఉద్దేశంతోనే, నాగరికపు వత్తిడిలో నుంచి. అతడికి ఆ కుర్చీని పెండ్లి కానుకల్లో ఒకటిగా యిచ్చాడు- ఆమె తండ్రి యిచ్చిన కానుక. ఆ కుర్చీలో భర్త కూర్చోవటం మూలంగా ఆమె ఏదో వింత ఆనందాన్ని పొందుతున్నదేమో? ఏదేమైనా ఆ కుర్చీని వదిలేసి భర్త మంచాన్ని ఆశ్రయించడం ఆమెకు నచ్చలేదు. కేకలు వేయటంతో ఆగక, వచ్చి, చర చర దాన్ని లాక్కొచ్చి "ఇక కూర్చోండి" అంటూ వెళ్ళిపోయింది.

అప్రయత్నంగానే శ్రీనివాసరావు పెదాలమీద చిరునవ్వు క్షణం మెదిలి జారిపోయింది.

"తనకు మిగిలింది ఆ ఒక్క అదృష్టం-ఆమె అనురాగమాధురి!" అని గొణుక్కున్నాడు.

శకుంతల మళ్ళీ గుర్తువచ్చింది. శకుంతలకూ అతనికీ అనురాగం విషయంలో సామ్యం కలిపింది.

శకుంతలను ఆమెతల్లిదండ్రులు నిరాదరించారు. ఆమె భర్త అనురాగం మాత్రం చెక్కుచెదరకుండా స్థిరముగా ఆమెను నవ్విస్తుంది. ఆ శ్రీనివాసరావుకు శ్రీమతి అనురాగం ఒక్కటే. మిగిలివుందనే భావం వుంది.

అతణ్ణి తండ్రీ, మావా నిరాదరించి వేశారను కుంటుంటాడు.

ఎందుకు నిరాదరించారు?

శకుంతలంటే తండ్రివి కాదని పెళ్ళాడింది. అతడూ తండ్రికి కొంత అయిష్టంగానే పెళ్ళాడాడు. అందుకని తండ్రిమనసుకు కష్టం కలిగించిందేమొ. మామ ఎందుకు నిరాకరించాడు? అతడంత విస్పృహపడడం దేనికి?

కొత్తవారికి అయోమయమైన విషయమే అది.

కాని అతను ఎంతో క్రుంగిపోయి బ్రతుకుతున్నాడని అనడానికి ఆధారాలు, క్రుంగిపోవడానికి గల కారణాలూ అంత తేలిగ్గా అర్థంకావంటాడు, శ్రీనివాసరావు.

భూమిని త్రవ్వి రత్నాలు వెతుకుతున్నంత కష్టసాధ్యంగా తెల్సికోవల్సి వుంటుందంటాడు.

ఒక్కొక్కసారి పాముని తాడనుకొని నిర్భయంగా అజాగరూకతతో మెలిగి అపదల పాలయినట్టే కొందరిప్రవర్తన, అభిమతాలు మామూలుగా చూస్తే దోషరహితంగా కనిపిస్తుంటాయి గాని. నిజంగా అవి చాల అనర్థదాయకాలనే విషయం అలస్యంగా తెలుస్తుందంటాడు.

లోకం సంగతేమోగాని, తన జీవితంలో చదువుకొన్న పాఠం అదే నంటాడు.

"నీకేమిరా అదృష్ట జాతకుడివి" అంటారు అతనిని చాలమంది.

అతడుకూడా అనుకున్నాడట - అంతేనని.

ఆ 'కల' ఎప్పుడో పదిసంవత్సరాల నాటిది. అదిప్పుడు లేదు. దాని శిథిల శకలాలు మాత్రం గుండెలో పటికిబెల్లం ముక్కల్లా గుచ్చుకుంటున్నాయి.

అంత అదృష్ట జాతకాన్ని అధ్వాన్నం చేసిందెవరు? అతడే చేసుకొన్నాడంటారు. తండ్రీ మావ.

అతని దైన్యానికి అతడే కారణం. అతడు వ్యర్థుడు, అశక్తుడు, అప్రయోజకుడు - అదీ తండ్రి - మామల ఏకాభిప్రాయం.

ఏమిటి అతని అశక్తత? ఏమిటి అతని అప్రయోజకత్వం?

ఒక మనిషి శక్తి సామర్థ్యాలు, ప్రయోజకత్వమూ అతని సంపాదననుబట్టి గుర్తించవచ్చునంటారు.

అది నిజమా?

ధనార్జన ప్రయోజకత్వానికి గీటురాయా?

అతడు సెకండ్ గ్రేడ్ టీచరు. అతని జీతపురాళ్ళెన్ని? అతడేం ధనాన్ని కూడబెట్టగలడు?

కూడబెట్టాలంటారు. తెలివిఅంటే అదేనంటారు.

అంటే - తండ్రీ, మామ ఉపయోగించే ఆ 'తెలివి' అనే మాటకు నిర్వచనం ఏమిటి? అతడికి అర్థం చిక్కక అడిగాడు.

"ఏమిటయ్యా ఆ తెలివి?"

"ఏమిటో తెలియదా? పోనీ, తెలివి లేకపోతే పోయింది. తెలివికలవాళ్ళనుచూసి, అనుసరించన్నా బాగుపడు" అన్నాడు తండ్రి.

"ఆ సుబ్బారావును చూసైనా నేర్చుకో" అన్నాడు మావ.

"ఎవడా సుబ్బారావు? ఏమా వండరు"— అని యోచించాడు చివరికి అతనూ తనలాగే ఒకానొక బడి పంతులు — అని తేలింది.

ఆ సుబ్బారావు స్కూల్లో చదువు చెప్పడు. ఇంటి దగ్గర స్కూలంత ప్రవేటుస్కూలు పెట్టాడు. వడ్లబస్తా మొదలు వంద రూపాయలదాకా ఫీజు గుంజుతాడు. పరీక్షల్లో లంచాలు పుచ్చుకొని మార్కులువేసి పాసు చేస్తాడు. పైగా అతడు సిగరెట్ త్రాగడు. అంటే పొగ పీలవడనికాదు - పొగాకును తిన్నంతపని చేస్తాడు. అతడు చుట్ట త్రాగుతాడు. రైతుల బిడ్డల్ని పొగాకు అడుక్కుంటాడు! ఇంకా కాఫీకూడా త్రాగడంట. పంచలు కడతాడంట.

అట్లా ప్రవేట్లుచెప్పటం తప్పన్నాడు శ్రీనివాసు.

"అదేరా నీ అతి తెలివి. అది తగ్గితేగాని నీవు బాగుపడవు."

"లంచా లుచ్చుకొని మార్కులు వేయటం నీచం."

"అహహా! నీతిశాస్త్రాలూ వల్లించావా అంతగా బాబూ! సంసారంకూడా నరకమేనని వ్రాసి వుంటుందే. మరి పెళ్ళెందుకు చేసుకొని నాగొంతెందుకు నొక్కేస్తున్నావు" అన్నాడు మావ.

"సిగరెట్ త్రాగాలి. కాఫీ అలవాటు"

"చుట్ట తాగు. గంజి తాగు. - శరీరానికి అది మంచిది' అది సలహా. "ఖర్చు తగ్గుతుందిప్పుడు" అది హెచ్చరిక —

కనీసావసరాలను తీర్చుకోకుండా, డబ్బును మూటగట్టడం లోభత్వం అవుతుంది. అది ప్రయోజకత్వంకాదు. అక్రమంగా. అన్యాయంగా సంపాదించటం వంచన. అది తెలివికాదు - స్వార్థం.."

అయినా ఇస్త్రీబట్టలు మానుకోవాలనుకున్నాడు. కాస్త ఖర్చు తగ్గించాలని - శ్రీమతి బావురుమంది. ఆమెకు భర్త టిప్ టాప్‌గా కనిపించాలి చుట్ట త్రాగితే అసహ్యం. గంజి వంచి పట్టుకెళ్ళమంటే "అంత గతిలేని రోజువస్తే యింత విషం పుచ్చుకుంటాం" అని ఏడ్చేసింది.

సంపాదన ఎంత వున్నా. నలుగురిలో మాత్రం తమ భర్తలు ఘనంగా, హోదాగల స్థాయిలో కనిపించాలని స్త్రీ లనుకొంటుంటారనే ఒక క్రొత్త విషయాన్ని అతడు శ్రీమతి ప్రవర్తన ద్వారా తెలుసుకొన్నాడు.

భార్య మనస్సును కూడా నొప్పిస్తే యిక అతనికి మనశ్శాంతి ఎక్కడ లభించేట్లు? అతనికేకాదు ఏ మగాడికీ లభించదేమో!

అయితే అతనికి ఆదాయాన్ని పెంచుకోవాలనే ఆరాటం లేదా? వుంది.

ఎవరికైనా వుంటుందనుకోవాలి.

బాగా బ్రతకాలనే కోర్కె లేని దెవరికి?

అందరి కోర్కె అదె

అయితే ఆ కోర్కె తీరటం అంత తేలికైన దేమీ కాదు.

అవకాశం కావాలి.

ఆధారం దొరకాలి.

వాటికి తెలివి తేటలు జోడించు కొన్నప్పుడే గోల్ కొట్ట గలిగేది.

ఆ విషయం నిరక్షరాస్యునకూ, అక్షరాస్యునకూ తెలుసుగదా!

అతడు మూడు సంవత్సరాలు - సుదీర్ఘ కాలం 'బ్రూసుపాలీడు'- కథలోని బ్రూసులాగా తన అభివృద్ధి మార్గంకోసం కొట్లాడాడు.

తండ్రి అతనికి పంచి యివ్వవలసిన పొలాన్ని పంచియివ్వడు. పంచితే అమ్ముతాడని, అమ్మి ఆగం చేసుకొంటాడని కొందరు దండ్రులదృష్టిలో కొడుకు ఎప్పుడూ పనివాడె. అతని అదృష్టం కాలి అతని తండ్రి అదే గుర్రాన్ని ఎక్కి సవారీ తీసే వ్యక్తయ్యాడు.

ఆస్తి పంచమని కోర్టుకు పోవాలా కొడుకు? పోతే కోర్టువల్ల కూడా కాని చట్టాల అడ్డంకు లున్నాయి.

వాళ్ళ ఆస్తి తండ్రి స్వార్జితం.

దానిని పంచమని కోర్టుకు వెళ్ళే సావకాశం అతనికి లేదు.

లోకానుసారంగా అతని వాటా అతనికివ్వమంటే యివ్వడు. అది పండించనూ చేతకాదు. సంపాదించటం ఎట్లా సంపాదించాడో గాని ఆదాయం లేదు. వ్యయంలేదు. అతని మైనరెళ్ళే నాటికి ఇరవై ఎకరాలుంది. ఇప్పటికీ అది ఇరవై ఎకరాలె. మధ్యకాలంలో చేసిన ఘనకార్యాలేవి -అంటే అతనికీ తమ్మునకూ పెండ్లిచేశాడు. అతనికి హైస్కూలు చదువైనా పూర్తి చేయించాడు గాని తమ్మునకు అదీలేదు

"పొలం ఏం అమ్మి చెన్నావు?"

"వ్యాపారం చేస్తాను. నా ఉద్యోగంవల్ల వచ్చే డబ్బుకన్నా చాలా చాలా అధికంగా అర్జిస్తాను. కనీస అవసరాలకు లోటు లేనంత డబ్బు నార్జిస్తాను..."

"వ్యాపారం అందరకూ అచ్చిరాదు" అంటాడు ఎవరికో నష్టం వచ్చింది అని కథలు చెప్తాడు "అయినా నీలాంటివాళ్ళు వ్యాపారానికి పనికిరారని" చెప్పేశారు తండ్రి.

"నేను సీతయ్యగారి వాళ్ళాయి వ్యాపారంచేసి లక్షలు కాకపోయినా వేలు గడిస్తాను. నాన్నా!" అని అడిగితే పొలం అమ్ముకోవచ్చేమో. అంటి నీతి అంతన్ని అతి క్రొత్తగా ప్రయోజనపడినా లెక్కగట్టి చూపెట్టింది తండ్రికి.

ఈ విషయం వింటే లోకం ఏమంటుందో మరి!

లంచం తీసికొని మార్కులు వెయ్యలేనివాడు వ్యాపారం చేస్తాడా? ఎన్నో కిటుకులు తెలిస్తేగాని వ్యాపారం నడవదు. అందులో యీ రోజుల్లో వ్యాపారం అంటే అర్థం మోసం- అని...అర్థం చేసుకో అమ్మాయి. మీ మావయ్య ఏదో అవ్యక్తపు మనిషని అనుకోకు" అని కోడలితో అనటమూ విన్నాడు శ్రీనివాస్.

"నేనే అవ్యక్తపు మనిషిని! అసమర్థుణ్ని మరి!" మనసులో అనుకొన్నాడు.

"పదేలు వీడికి బిడ్డనెందుకు ఇవ్వలేదో తెలుసా?... వీడి చాదస్తం చూస్తే... వీడి పిడులు విష్టలు పనికిమాలినవనే. ఈ కాలంలో మనిషిగా చలామణీ కావాలంటే అన్నింటా సమర్థుడుగా కనిపించాలి. తెలిసిందా- అది నీ మగనికి చాతకాదు" అని నవ్వాడు తండ్రి.

కోడ లేమనుకొని వుంటుందో? తన భర్త అసమర్థుడే కాబోలు. తెలియక తనతండ్రి మోసపోయి. తననిచ్చి పెళ్ళి చేశాడని అనుకొని వుంటుందా?... ఏమో అలా అనుకొని వుంటుందనే అతడు క్రుంగిపోయాడు. కుపితుడయ్యాడు. తండ్రిని అసహ్యించుకున్నాడు. జన్మలో తండ్రి ముఖం చూడగూడదనుకున్నాడు.

"నాన్న మూర్ఖుడు."

ఈ వాక్యాన్ని వింటే లోకం హర్షించదు. తండ్రిని దూషించే తనయుణ్ని చిత్రవధ చేయమంటారు. తండ్రికోసం తమసుఖాన్ని వదిలేసుకొన్న భీష్మాదుల కథలను లొట్టలేస్తూ చెవులప్పగించి వింటారు. ప్రహ్లాదుడు అంతగా నచ్చడు అందువల్లే.

కొడుకు నిజంగా బలహీనుడే అనుకుందాం? ఆ బలహీనతను కోడలితో ఏకరవు పెట్టవచ్చా? భర్తపట్ల తేలికభావం ఏర్పడిన స్త్రీ భర్తపట్ల గౌరవానురాగాలను వ్యక్తీకరించగలదా? అసాధ్యం. పైగా తనపట్ల గౌరవభావం లేని స్త్రీతో ప్రశాంత జీవితాన్ని ఎంత సమర్థుడైన మగవాడైనా గడపలేడు.

మరి అంత తల నెరిసిన మనిషికి ఆ పాటి జ్ఞానం లేదా! అనాలోచితంగా ఏదోపాటి అనేసే అలాంటి చిల్లర మాటలే చిలికిచిలికిగాలి వానైనట్టు హృదయాలను ముక్కలు చేస్తాయనిపిస్తుంది.

అయితే అతను కొంత అస్పష్టపంతుడు కావటాన్నేమో శ్రీమతికి అతనిపై ఉదాసీనభావం జనింపలేదు. భర్తని నిరాకరిస్తున్నాడని మామపట్ల కసిని పెంచుకొన్నది శ్రీమతి!

కుఫం!

తండ్రిపైన ఆశ అలా అర్ధాన్నమయిపోయాక మామగారివైపుగా పెరుగుతాడు శ్రీనివాస్.

వివాహ సమయంలో నాలుగెకరాల భూమిని చదివింపు చేశారు. అది అమ్మివేసుకొంటామంటే "ఏ ఎంటా అమ్ముకొని యిక్కడికే రారాదూ" అన్నట్టు మాట్లాడాడు మామ.

మామలకు ఇదొక జబ్బు. కూతుళ్ళకు ఆస్తి కొడుకులకిచ్చినట్టు యివ్వటానికి బాధపడతారుగాని స్వాతంత్ర్యం అవకాశం కలిపించినా అల్లుణ్ణి లేచితన ఇంటి సరసన రమ్మంటారు.

"అది కాదయ్యా బాబూ!"

"ఏమిటి బుజ్జన్నా ఏమిటీ"

పుస్తకాలషాపు పెట్టాలనుకుంటున్నాను- అందుకని పొలం అమ్మేస్తాను."

"ఏమిటా షాపూ-వాపూ" పరిహాసంగా నవ్వాడు మామ.

మామగారి వూరికి దగ్గర్లో ఒక పెద్ద ఊరుంది. అక్కడ క్రొత్తగా కళాశాల ఏర్పాటు చేస్తున్నారు. ఆరులక్షలదాకా దొనేషన్లు వసూలయ్యాయి.

కళాశాల పెడితే అక్కడ ఆదివరకు బుక్‌షాప్ అంటూ ఒకటిలేదు బుక్‌షాప్‌వల్ల మంచిలాభం వుంటుంది. ఎట్లా లేదన్నా సంవత్సరానికి ఐదారు వేలు లాభం వుంటుంది.

అతనికి వచ్చే జీతం, మావయ్య చదివించిన పొలం తాలూకు కవులూ అన్నీ కలుపుకొన్నా సంవత్సరానికి రెండువేలన్నర. కాబట్టి ఉద్యోగం కన్నా వ్యాపారం లాభంగా కనిపించింది.

ఆ విషయం చెప్పాడు శ్రీనివాస్.

"నీవు సంపాదించిన వార ఇంక రెండు సంవత్సరాలలో పొలం రేటు పెరుగుతుంది. ఎందుకు వచ్చిన బాధలాస - వో వెయ్యి యిస్తాను - పట్టుకెళ్లు. ఏ దక్షిణ దేశయాత్రో చేసిరండి" అన్నాడు మామ.

ఆయనకు ఎలా నచ్చ చెప్పాలి. చిన్నపిల్లవాడి ఆటాన్ని తప్పించుకోటానికి, తల్లి ఏగానెముకో చేతి కిచ్చి మైదుపుచ్చినట్లు, వో వెయ్యి యిచ్చి అయినా సరే అల్లునిలో చెలరేగిన వ్యాపారపుఆలోచనలనుండి ఆవలకు గుంజాలనే మావయ్య సంకల్పం.

"పొలానికి పెరిగేరేటుకన్నా షాపువల్ల ఎక్కువ వస్తది."

"పొలానికి ఎంత పెరుగుతుందో నీవు కలగన్నావా?"

"కనలేదు."

"ఎకరం పదివేలు కావచ్చు."

"అంత ఆశ వుండటానే మన కర్మ యిలా కాలుతుంది."

"గుంటూరు జిల్లాలో ఎకరం వెయ్యి రూపాయిలు అమ్మినభూమి యిప్పుడు పదివేలు" అంటూ కుంటిసాకులకు దిగాడు.

ఏమీ లాభం లేదు —

బతామెక్కింది ప్రయోజనంలేదు.

ఎక్కేశాడు శ్రీనివాస్.

"సరే అమ్ముకో" అన్నాడు మామ చేనుబేరం పెట్టాడు.

ఆ చేను ఎవరూ కొనలేదు.

కారణం - ఆ చేనుకి చుట్టుపట్ల వున్న రైతుల వద్ద డబ్బులేదు.

మావయ్య పొలంలో మరొక చేనుకొంటా మన్నాడు.

"పోనీ ఆ చేనులో మూడెకరాలివ్వు. అమ్ముకుంటాను."

"అమ్మితే యిస్తాను. అమ్మకపోతే ఆ చేలో నాలుగెకరాలు యిస్తాను"

అదేమిటి మేచి.

అదేదో బస్తీ పితలాటకంలా వుంది."

నాలుగు ఎకరాలకు నాలుగు ఎకరాలు యిస్తానన్నాడుగద. అమ్ముకుంటే ఎందుకివ్వడు? అమ్ముకోటానికే కదా-అసలు ఆచేలో యివ్వమంటుంది.

అది మంచి చేను.

అందుకని మూడెకరాలే యివ్వమన్నాడుగదా?

"అమ్మో అది మా నాయన నాయనల నాటి చేను. అమ్మవీయను" కథను అడ్డం తిప్పాడు మామ.

అది రాంబాణం.

ఇక తిరుగులేదు దానికి. శ్రీనివాస్‌కు వేరొక దారిలేదు.

"ఈ తిరకాసేమిటి శ్రీమతీ?"

"పొలం అమ్మటం యిష్టంలేదు."

"అమ్ముకోకపోతే డబ్బులేదు. అక్కడ నాన్న అమ్మనివ్వడు. వచ్చిన ఛాన్సు ... కొట్టేస్తాడు. మరొకడెవడో బుక్‌షాపు పెట్టేస్తాడు. ఎంతకాలం యిలా అఫ్ టిక్కెట్టుతో విందు ప్రయాణంచేసేట్టు. నీవైనా మీ నాన్నకు నచ్చచెప్పి. అమ్ముడయ్యే చేలో మూడు-కాదు రెండున్నరెకరా లివ్వమను" అని ఏకాంతంలో పూజా పుష్పాదులు సమర్పయామీ అని వరం కోరాడు శ్రీనివాస్.

"మీ పొలం అమ్ముకో మంటున్నారు" అన్నది శ్రీమతి. ఆమె తండ్రి పక్షమో, అతని పక్షమో, ఏ పక్షానికీ చెందని అయోమయపు పక్షమో శ్రీనివాస్‌కి తెలియలేదు.

"నాన్నను ఆస్తి అడిగే హక్కు లేదు."

"మానాన్న అసలు భూమె యివ్వనంటున్నాడు

"ఇవ్వనివాడు యిస్తానని ఎందుకు చెప్పాలి నలుగురిలో?"

"ఆస్తి పంచని వాడు మిమ్మల్ని ఎందుకు కన్నాడు?"

శ్రీనివాస్ గుండెల్లో కత్తిపెట్టి గుచ్చినట్లు గుచ్చుకుందామాట, కోపం పొంగింది. రక్తంభగ్గుమంది. శ్రీమతి చెంప పగిలింది-అదేనా పర్యవసానం! కాదేమో. వట్టి ఆవేశమేనేమో అంతే.

ఆమెబావురు మంది "నన్నేం చేయమంటారు. నా చేతుల్లో ఏముంది. కావాలంటే నగలు తీసికొని అమ్ముకోండి. నేనేం చేయను. అంటూ ... చుట్టేసుకొని భర్త గుండెల్ని కన్నీటితో కడిగింది.

కందిపోయిన ఆమె చెప్పేనుచూస్తే అతని కన్నులు చెమ్మగిల్లాయి. హృదయానికి హత్తుకొన్నాడు. కన్నీరు తుడిచాడు. అంతకన్నా ఏం చేయగలడు?

ఏమీ చేయలేడు.

ఏమీ చేయలేక మళ్ళీ ఉద్యోగంలోకి వెళ్ళాడు.

అదే-గుర్రెతోకవంటి బెత్తెడు జీతం.

ఏటా మామ పంపించే కౌలు దానికు పైకం నాలుగు వందలు.

ఇరువురూ నలుగురైనారు.

ధరలూ పె రి గా యి — దినగండాలొచ్చాయి సామాన్యులకు.

అదీ శ్రీనివాస్ గుండెల్లో కుంపటి. అతని క్రుంగుదలకు కారణం అలా విస్తృతించి వుంది.

ఆ పనిమీద ఆశ వదిలాక, వ్యాపారంమాట మరచిపోయాక బి.ఎ.కి ప్రవేటుగా చదవసాగాడు. ఇంకా వో పార్టు మిగిలివుంది. అది ఈ సంవత్సరం పూర్తి చేయటానికి తిప్పలుపడుతూ వుంటే మావకు ఏం తల తిరిగిందో "మీ చేను బేరం పెట్టాను. వచ్చి పోవల్సింది" అంటూ వో కార్డు ముక్క రాశాడు.

ఎందుకిప్పుడు అమ్ముకోవడం.

ఇంకో రెండేళ్ళల్లో సాగర్ వాటరు రాబోతుంది. చేను మాగాణవృద్ధి. పాలికి యిచ్చినా నాలుగైదు పుట్ల వడ్లిస్తారు.

అయినా ఏం వ్యాపారం చేసేట్టు.

ఎక్కడ కాశీ లక్కడ బిగుసుకొన్నా యీ ప్రాంతంలో.

శ్రీనివాసరావు బుక్‌షాపుమీద ఆశ వదిలేశాక, ఒక స్నేహితుణ్ణి ఆ పని చేయమని ప్రోత్సహించాడు. అతడు బుక్ సెంటర్ పెట్టాడు. అంతా ఆరేడువేల పెట్టుబడి, ఏడెనిమిది సంవత్సరాల్లో ఆ షాపుమీద ముప్పయివేలదాకా ఆర్జించాను, పదివేలల్లో 'ప్రెస్' పెట్టాడు పదివేలల్లో యిల్లు కట్టుకొన్నాడు.పదివేలు బ్యాంకులో పెట్టుకొన్నాడు.

కాని శ్రీనివాసరావు మావ ఉత్తరంలో ఏమని వ్రాశాడో-ఆ తెలివికి ఏడ్వాలో, నవ్వాలో తోచక ఊరుకొన్నాడు.

"చూశావా! ఎకరం ఖరీదు నాలుగువేలు. అంటే అప్పటికన్నా యిప్పుడమ్మటాన మీకు ఏడెనిమిది వేలు అదనంగా వస్తున్నాయి. ముందు చూపంటే ఇదేనోయ్ యిదే."

అదేనా ముందుచూపు.

ముప్పయి వేలల్లో ఏడెనిమిది వేలెనో్న వంతు? ఏడెనిమిది ఏళ్ళల్లో ఆర్థిక యిబ్బందులతో నలిగిపోయిన హృదయానికి ఎంత నష్టపరిహారం చెల్లించాలి?

ఈ లెక్కలు మావకు అర్థంకావు.

శ్రీనివాస్‌రావు పడిన అగచాట్లకు కారణం అతని అప్రయోజకత్వమే అంటాడు మావ.

అది నిజమేనా?

ధనం సంపాదించుకోడానికి కావాల్సిన ముడి సరుకు ఉంది శ్రీనివాసరావుకు. కాని దానిని ఉపయోగించుకోసిలేదు. అందువల్లే అతడు ఉండీ లేనివాడయ్యాడు. మహారాజయ్యుండీ బికారిలా బ్రతుకీడ్చాడు.

అదేవిటి!

అదే దిగులు,

అదే బాధ.

ఆ వ్యథను ఉత్తరం పెంచింది.

అందుకే శకుంతలకోసం నిరీక్షణ.

ఆ పూట రాలేదు శకుంతల.

కుర్చీకి సెలవ యిచ్చాడు శ్రీనివాసరావు. ఏ కారణం వల్లనో రాలేక పోయి వుంటుందను కున్నాడు.

రాదేమో అనుకున్నాడు.

ఆ రేయి సరిగా నిద్దుర పట్టలేదు.

మనస్సు మరీ కకా వికలై నట్లనిపించింది.

జాగరణ చేశాడు శ్రీనివాస్.

మరునాడు నిరాశగానే సిగరెట్ త్రాగుతూ, అదే కుర్చీలో కూర్చుని "మావకు ఏదో జాబు వ్రాయటం అనుకుంటున్నాడు. అంతలో శకుంతల వచ్చింది.

అతని ముఖంలో వో నలుసంత జీవకళ కదలటం ఆమె చూచింది. మందహాసం చేసింది." ఎందుకు క్రుంగిపోవటం మన జీవితాలింతే-భయపడకు" అన్నట్లుందామె చిరు దరహాసం. ప్రీగా గాలి పీల్చుకోగలిగాడు శ్రీనివాస్.

స్కూలు నుండి వచ్చేసరికి తీరుబాటుగా పొగ పీలుస్తున్నాడు మావ. వసారాలో మంచంలో విశ్రమించి-సలకరించినట్లుగా నవ్వాడు మావ-

కుశల ప్రశ్నలు వేశాడు శ్రీనివాసు కుర్చీలో కూలబడి.

"ఏం తేల్చావు?"

"దేన్ని గురించి?"

"బలేవాడవేనే మొత్తానికి...నా జాబు రాలేదా? అని వసారా ఎగిరేలా నవ్వాడు. ధ్వనే వినిపించింది. గాని నవ్వు మీసాల చాటున మృగ్యమయింది.

"చేను బేరం సంగతేనా?"

"ఆఁ! అదే మంచి బేరం వచ్చింది.

"మీ నాయన నాయనల నాటి చేనన్నారుగా. ఎందుకూ అమ్మొద్దు" అన్నాడు కోపాన్ని దిగ మ్రింగుకుంటూ. ఒకనాడు ఆమాట అ మావ నోట వినే నోరు మూసికోవాల్సి వచ్చింది తను.

మావ నోరు తెరిచాడు- మీసాల ముళ్ళపొద చాటుగా సంబాళించుకోవాల్సి వచ్చింది.

అంత సూటిగా దెబ్బ వేస్తాడని ఊహించి వుండడు. చేనమ్ముతా ననగానే అల్లుడు సంబరంగా కేకవేస్తాడనుకున్నాడు.

ఊహ తల్లక్రిందు లయింది.

ఆ నొప్పిని వొత్తిగించుకొని లేవడానికి ఓ నిమిషం పట్టింది.

నవ్వును ప్రయత్న పూర్వకం గానే అతికించుకొన్నాడు.

"నాన్న, నాన్న నాటిదే...మనసు వొప్పలేదు. కాని నీవేదో షాపు, షాపు అన్నావని...ఆఁ! అందులో మంచి బేరమూ వచ్చింది" అన్నాడు మావ."

ఆ మాటల్ని వింటుంటే నిప్పుల మీద నిలిచి నట్లుంది శ్రీనివాస్‌కు

"కాలిరగగొట్టి చేతి కర్రను దానం చేయటానికి వచ్చావా!" అందామని పించింది, మళ్ళీ అనవసర మనుకొన్నాడు. మాటంవల్ల తాను పోగొట్టుకొన్న దేదో అది రాదనుకొన్నాడు

"షాపు పెట్టుకో" అన్నాడు తిరిగి మామవాకిటిపోపలగా వుంది. శకుంతల ఆ సంభాషణ వింటూనే వుంది.

"షాపా! యింకా ఏం షాపు. అదెప్పుడో 'బి-ఏ' నాటిమాట."

"ఇప్పుడేం వచ్చింది మళ్ళీ"

"ఏవుంది ఎప్పుడో షాపు పెట్టారు."

"పెడితే నేం?"

"రెండు షాపులైతే గిట్టుబాటు కాదు. పైగా ముందు పెట్టినవాళ్ళు అన్నింటా స్థిరపడిపోయారు. వాళ్ళతో పోటీపడలేము"

"అంటే షాపూ, గీపూ లేవంటావ్" కొరకొర చూశాడు మావ.

"మనకు తీరిందొక పగలు నిలబడి వుందని మనకు తెలియలేదు." మెత్తగానే ఓ పోటు పొడిచాడు.

కస్సు మన్నాడు మావ.

"అదికాకపోతే మరొకటి."

"అది మంచి వ్యాపారం-అంటే నాకు నచ్చిన వ్యాపారం - మోసగించాల్సిన పనిలేదు. అందుకే నేనా వ్యాపారం కోసం అంతగా కొట్టుకలాడాను. యిప్పుడు చేజారిపోయింది." అని నిట్టూర్చాడు.

"ఏవిటేవిటి! నీ బిజినెస్సులోనూ ఆదర్శం ఉందా? అట్లాచెప్పు మరి! ఆదర్శం పిచ్చివుంటే నీకు ఇంకా దూరంగా ఉండాలి మేము! ఏవంటే ఎవడో చెప్పినట్టు 'వట్టి పిచ్చివాణ్ణి లోకం పాడు చేస్తే, ఆదర్శం పిచ్చివాడు లోకాన్ని పాడుచేస్తాడంట'." అని నవ్వాడు పెద్దగా....

"ఎవడిపిచ్చి వాళ్ళకు ఆనందంలెండి"అన్నాడు రూక్షంగా - చివాల్న లేచి అక్కడనుండి వీధిలోకి వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

అయితే వ్యక్తిగత అభిరుచి లుండటం కూడా బలహీనతేనా? ఏ పని పడితే ఆ పని చేయటం అందరికీ సాధ్యపడదేమో. ఒకరికి ఒకటి నచ్చుతుంది. మరొకడికి వేరొకటి నచ్చుతూవుంటుంది. పూలబేరం చేసేవాణ్ణి చేపలు అమ్మమనంటే అమ్మలేడు. చేపల బేరం ఉన్నదని తెలియకనా పూలబేరం పెట్టుకుంది. తెలుసు. పూలబేర మంటేనే మక్కువ అంటే అది చేతకానితనం అనే మనిషిని ఏమనాలో తోచలేదు శ్రీనివాస్‌కి.

సొంతంగా వ్యక్తిత్వం అంటూ ఒకటి లేని వాళ్ళు ఎదుటివారికి వ్యక్తిత్వం ఉన్నదని గుర్తించలేరనుకొని నిట్టూర్చాడు-అంటే మావకు వ్యక్తిత్వము లేదేమోనని శంకించాడు.

వీధిలోకి వెళ్ళాడు - పరిచితులు ఎవరూ కనిపించలేదు. ఏవీ తోచలేదు.

రోడ్డునే పడి చీకటి పడేదాకా నడిచాడు - చీకటిని చూచి ఊరివైపు తిరిగాడు.

తనకున్న ఆస్తిలో నాలుగో వంతు ఆస్తి వున్న వాళ్ళు - దానిని అవసరం పడినప్పుడు, అవసరం వచ్చినట్లుగా ఉపయోగించుకో గల

స్వాతంత్ర్యం ఉన్నవాళ్ళు, పది సంవత్సరాల్లో ఎంత బాగుపడ్డారో ఆలోచించాడు.

ఆలోచనకూడా బాధనే పెంచింది. పెంచాలి. ఏమంటే అది అతని ధైర్యానికి అడ్డం పట్టగలది గావున-

పొలం అప్పుడు అమ్ముతాననటూ మావ రావటంకూడా బాధించింది. ఎందుకు బాధించదూ! మైళ్ళకొలదీ వర్షంలో తడిచివస్తున్న వానికి, ఇంకో పదిగజాలలో ఇల్లువుందనగా గొడుగు అందించబోతే ఏపాటి సంతోషం కలిగేనంటారు? ఇదీ అంతే గదా!

పైగా మనిషి ఏదైనా తనకు లేకపోయినప్పుడు కలిగే బాధకన్నా అది ఉండి కూడా ఉపయోగించుకోలేనప్పుడే మరీ బాధపడతాడు.

శ్రీనివాస్ అలాటి స్థితిలోనే వున్నాడు. అందువల్ల ఆదారిలో నడుస్తుంటే శకుంతల గుర్తు వచ్చింది. ఆమెతో అసలు విషయాలేవీ చెప్పుకోనే లేదని స్ఫురించగానే చెకచెకా నడిచాడు శ్రీనివాస్.

శకుంతల్ని తలచుకొని నిట్టూర్చాడు.

తండ్రి ఆమె చెల్లెలికి నాలుగు ఎకరాల భూమి యిచ్చాడు. కాని ఆమెకు 'సెంటు' యివ్వలేదు. గడపకూడా తొక్కనివ్వలేదట!

భర్తకు, అతని జీతపు రాళ్ళతో అవసరాలు తీరక - ఏదో ఉద్యోగమన్నా చేసి సహాయపడాలని మెట్రిక్ పరీక్షకు అప్పియరయింది శకుంతల. లెక్కల్లో తప్పింది. రెండోసారి అప్పియరైంది. పరీక్షల సమయంలో 'టైఫాయిడ్'అంకించుకుంది. దానితో తిరిగి కోలుకోవడానికి సంవత్సరం పట్టింది. పరీక్షలకూ, జబ్బులకూ డబ్బు ఖర్చు-ఆమె మెడలో వున్న వెంట్రుకవాసి బంగారు గొలుసూ కరిగిపోయింది.

మళ్ళీ పరీక్ష వ్రాయలేదు.

ఏదో నాలుగు ట్యూషన్లు చదితే పదో, పాతికో వస్తాయి. ఇద్దరు పిల్లలు - అందులో ఆడపిల్లలు భర్త అనురాగమే పెద్ద ఓదార్పు అయిందామెకు.

తనకూ చివరకు మిగిలిందదే ననే తలంపు మనసుమీదికి వెన్నెల జాలులా ప్రాకింది—

శ్రీమతి బొమ్మ కనుల్లో మెదిలింది. ఆమెమీద జాలివేసింది. ఆమె మీద ప్రేమ వేసింది. తన మూలంగానే ఆమె కష్టాలనుభవించిం దనిపించి బాధవేసింది.

ఇంకా వడివడిగా నడిచాడు శ్రీనివాస్. చీకటి అంతగా చిక్కపడినదని అతడు గుర్తించనేలేదు.

మనసు మనసులో వుంటేగా — మనసు...అది అసలే లేదనుకొన్నాడు.

కొంత తండ్రీ, మావా పాడు చేశారు. ఇంకొంత వాళ్ళు కల్పించిన పేదరికం తినేసుంటుందేమో ననుకుంటూ యిల్లు చేరాడు.

మావయ్య వెళ్ళిపోయిన కబుర్ని వీధివాకిటిలోనే 'చిన్నా' చెప్పాడు.

లోనికివెళ్తే వసారాలో బెడ్ లైటుందిగాని ఎవరూ లేదు. నట్టిల్లు చీకటిగానే వుంది.

వంట యింటిలోనుండి ఇంటి వెనుక ఖాళీ స్థలంలోకి వెళ్దామని రెండడుగులు వేశాడు.

శ్రీమతి శకుంతలతో మాటాడటం వినిపిస్తుంది. అందులో విషయం ఏదో అతనికి సంబంధించినట్లు ధ్వనించింది. ముందుకువెళ్తే ఆ ముచ్చట ఆగిపోద్ది. శ్రీమతి అభిప్రాయం ఏమిటో తెలిసికోవాలనే కుతూహలంతో వంట యింటి కిటికీ ప్రక్కకు నడిచాడు.

"మా నాన్న అన్నాడంటే ఎందుకు అనడూ" అంటుంది శ్రీమతి.

శకుంతల వింటున్నట్లుంది.

"పోనీ అప్పుడు యివ్వలేదు. యిప్పుడిస్తా నంటున్నారుగా. ఏదోటి చేయవచ్చుగా. తెలివితేటలుండాలిగాని ఏదో వ్యాపారం కనిపించదూ" అని సాగదీస్తుంది.

అంతవరకు బాగానేవుంది. ఆమె కోరదగిన కోరికే అది.

"ఇంతకీ ఎందుకోసూ ఆసక్తిలేనివాడు నీ తమ్ముడు. అది నా దురదృష్టం" అని నిట్టూరుస్తుంది శ్రీమతి.

శకుంతల ఏమీ అనలేదు. నిజంగా భర్తను అంతేనా శ్రీమతి అర్థం చేసికొన్నది?

"ఏదో బిజినెస్ చేయాలనే పట్టుదలే వుండి వుంటే, మా మావగార్ని గట్టిగా అడిగితే యిచ్చేవారే...అడిగితేగా...ఏదో పైకి ఎవరైనా ఏమైనా అంటారని ఏదో కబుర్లల్లో కబురుగా వో మాట అనడం, తండ్రి మంచాడుకాదు - మావ మంచాడు కాదు అని వాళ్ళమీద నింద వేసి తనకు తానొక ఘనస్తునిలా కనిపించటం - నీవేమన్నా అనుకో వదినా! నీ తమ్ముని ప్రయోజకత్వం ఏంటో పదేళ్ళల్లో నాకు ఓ పిసరంత కనిపించలేదు." అన్నది చంటాణ్ణి వడిలోంచి చాపమీదికి మారుస్తూ-

శ్రీనివాస్ కా మాటలు బాణాల్లా తగుల్తున్నాయి.

"ఇదివరకెప్పుడూ యిట్లా చెప్పలేదేం సుశీలా! ఎందుకని చెప్పలేదూ" అంటుంది విస్మయవ్యాకుల కంఠంతో శకుంతల.

"మనసులోనే దాచాను వదినా! అయన యీ మాటలు వింటే క్రుంగిపోతారు. అందుకే నీతోనూ అనలేక పోయాను. నీవు మీ తమ్మునితో అంటావేమో"నని అంటుంది శ్రీమతి.

"అయితే నేను అప్రయోజకుణ్ణనే అభిప్రాయం శ్రీమతికి దీర్ఘకాలం నుంచే వున్నదన్న మాట. నిజంగా నేను దుర్బలుణ్ణా? నన్ను దుర్బలుణ్ణిగా మా నాన్న, మామయ్యల గోబెల్సు ప్రచారం సర్దారించిందో ఏమో?" కంపించి పోయాడు.

"ఒకప్పుడు శ్రీమతి ఎవరి పక్షమో, అయోమయం పక్షమో నా పక్షమోనని తికమకపడ్డాను. కాని ఆమె తండ్రి పక్షం—"

"నా అప్రయోజకత్వం ఏమిటి?"

"పోనీ! నేను సంపాదించలేని వాణ్ణి, ఆమె ప్రయోజకత్వం ఏమిటి? శకుంతల భర్తకు ఆర్థికంగా శక్తి వంచన లేకుండా సహాయపడింది. సహాయపడాలని చదివింది కూడా. శ్రీమతి ఏమైనా సహాయం చేయాలని ప్రయత్నించిందా? లేదు. ఆమె తండ్రి ఈ పదేళ్ళలో ఏమైనా సంపాదించాడా? అదీ లేదు. కుండలో కూడు కుండలోనే వుండాలి. అబ్బాయి దుడ్డాలుండాలంటే ఎక్కడో దొంగ తిండి మెక్కమనేగా యీవిడ సులారింపు? తన తండ్రికి ఇష్టం అయినప్పుడు బేరంచేయాలి- గాలి పీల్చుకోవాలి - నవ్వాలి - అంతేగాని నాకో వ్యక్తిత్వం అంటూ లేదూ!"

"అంతేనా? అంతేనన్నమాట!!"

మనసులో అనుకొన్నాడు శ్రీనివాస్.

శ్రీమతి గుండెల్ని చీల్చి — ఆమెలో యింకే అపోహలు దాగివున్నాయో చూడాలనే ఆవేశం ముంచుకొచ్చింది, చర చరా వంటయింటి వాకిటి దాకా వెళ్ళేసరికి—

"అసలే క్రుంగిపోతున్నాడు సుశీలా! ఎన్నో హంగులున్నాయి. ఎంతో ఆస్తి వుంది. ఏదీ సమయానికి ఉపయోగపడలేదన్న బాధ మనిషి నెంత నిరుత్సాహ పరుస్తుందో..." అని ఏదో చెప్పబోతుంటే శ్రీమతి, శకుంతలను తట్టింది, అంతే. ఆమె పెదవి విప్పలేదు.

—ఇద్దరూ చూశారు శ్రీనివాసును.

జామచెట్టు ప్రక్కన చాపమీద కూర్చుని వున్నాడు. గుడ్డిగా లాంతరు వెలుగువారి ఆకారాంతు అంచులు గీస్తుంది.

ఎవరువేశారో కుర్చీ అక్కడకు చేరింది. చీకటిలో అంతా నల్లని బురదలాగా వున్నాయి మొక్కలు.

ఆవేశంగానే వెళ్ళి కుర్చీ లాక్కొని విసురుగా కూర్చున్నాడు. ముందుకాలు పళ్ళుమని ఇరిగింది. కుర్చీ ఒరిగింది, తూలి పడిపోయాడు.

పెద్దగా దెబ్బ తగల్లేదు.

"ఇంత పాతబడి పాడైపోయివుంటే యీ కుర్చీని ఓ మూల పారేయకపోయావా?" అన్నది శకుంతల.

"పాతబడిందని పారవేయాలంటే అన్నింటిని పారవేయగలమా శకుంతలా! పారవేసినా అందరూ పారవేయగల వాళ్ళుంటారా? అంత స్తోమతకావాలి మరి! కొందరికి డబ్బు వుంటుంది. దానిని వాడేసుకొనే స్వేచ్ఛకూడా ఉంటుంది. కొందరికి డబ్బుంటది. కాని దానిచుట్టూ కాపలాకాసే పాములుంటాయి. ఆ డబ్బు అతనదే అని ఆ పాములకూ తెలుసు. అయినా వానిని తాకనీయవు. వాటి తల చిదపవచ్చు. కాని చిదపడానికి మేనయ్య అడ్డొస్తది-!"

శ్రీమతికి అర్థమయినట్లుంది. ఆ ఎత్తిపొడుపు. వంటయింటిలోకి జారుకుంది.

"ఓ కథ ఉంది- వాచక పుస్తకాలల్లో. గాటిలో మేతవుంది. ఆ గాటిలో ఓ కుక్క చేరింది. ఆవు మేతకువచ్చింది. కుక్క కరవవచ్చింది. ఆవు మేత మేయటానికి వీలులేదు. కుక్క - పోనీ అదైనా తిన్నదా అంటే తినలేదు. ఆకలితో ఆవు పటించింది కాని కొమ్ములతో కుక్కను కుమ్మలేదు. ఆ ఆవు వంటి సాధుజనులుంటారు కొందరు. ఏమంటావ్ శకుంతలా! అంతేనా?" ప్రశ్న వేశాడు శ్రీనివాస్.

శకుంతల నిట్టూర్చి లోనికి వెళ్ళింది.

వంగిన కుర్చీనీడ వింతగా అతనిమీదపడుతుంది.

ఉపయోగం యీశ్చక పోయిన కాళ్ళతో వున్న కుర్చీ యిప్పుడు మరోకాల్నికూడా విరగ్గొట్టుకుంది.

"వెనక్కాళ్ళను నాన్న, మావయ్య అనుకుంటూ

ఉండేవాడ్ని యిప్పుడు విరిగిన కాలును చూస్తుంటే. శ్రీమతి మాటలు గుర్తుకు వస్తాయి విరిగిన కాలు శ్రీమతి. అందరూ నన్ను హీన పరిచినా నీడలాగా నన్ను అనుసరిస్తూ, కష్ట నష్టాలను భరిస్తూ, అనురాగంతో నాకు ఊరట కలిగిస్తున్నదనే నమ్మకంతో గాలి పీల్చుకొంటున్న నేనంటే, 'ఆమెకు' ఏ అభిప్రాయం వుందో తేలిపోయింది.

"అనురాగం అని నేననుకున్న ఏ పట్టి నటన! కాదు అది అనురాగం కాదు. స్త్రీకి మగవాడితో వున్న అవసరం మాత్రమే..."

"అంతేనా ..అంతేనా .."

శ్రీనివాస్ తల ముక్కలయిపోతుంది.

శ్రీమతిని నాలుగు తన్ని పుట్టింటికి పంపేస్తే కొంత లభిస్తుంది. వాళ్ళనాన్న తాకట్టుపెట్టిన అప్పుడే ఆ చేనును మార్చి అమ్మి డబ్బు యివ్వలేదనే కక్షతోనే అలా చేయాలనుకున్నాడు. అలాచేయబోతున్నట్టు శకుంతలతో చెప్పేయాలనుకున్నాడు తన తండ్రి తలబద్దలు కొట్టాలనే నిశ్చయాన్ని కూడా చెప్పాలనుకున్నాడు. కాని చెప్పలేదు.

చెప్పలేక యిలాగే కాలం గడుపుతున్నాడు మానవుడు.

"నేనలా చేస్తే మావయ్య డబ్బు సిద్ధంచేసేవాడే కాని నలుగురు నన్నేమనేవాళ్ళు? ఎంతఅమానుషుడవయ్యా అని నా మొహానే అనరా? అయితే అలా అన్నా సరేనని అలాని చేసినా నా స్నేహితుడికి మల్లె నేనే బుక్‌షాపు పెట్టి ముప్పయి వేలు సంపాదించినా అప్పుడు నన్ను ప్రయోజకుడంటారా?"

"అంటే నాలో లేని దేమిటి?"

"ఆ అదృష్టమేనా?"

"ఇప్పుడు వ్యాపారం చేస్తాను. సంపాదిస్తాను డబ్బుని. అయినా ఆ డబ్బును సంపాదించింది గానీ నాలో ప్రయోజకత్వమెక్కడుందని నా భార్య అనడానికి ఏముంది? పైగా డబ్బు వాళ్ళ నాన్న యిస్తున్నాడు."

"హారే! శ్రీనివాస్‌రావ్! నీవు ప్రయోజకుడవని నలుగురిచేత కాకపోయినా నీ భార్య చేతనైనా అనిపించుకొనే అదృష్టం లేదురా-లేదు."

"నీవు కొలువుదీరే కుర్చీ ముందు కాలు కూడా విరిగింది. నీ సింహాసనం వాలింది. అంటే నీ జీవితమూ — అంతే"

"నో" అంతరాత్మ ఘోషించినట్లు అతని గుండెల్లో మార్మోగింది.

ఆశ్చర్యంతకు, ఆనందానికి నోచుకోని అతని హృదయం వేదనా భారాన్ని దించుకొందామని, మామయ్య ఉత్తరం పదేళ్ళ ఆలస్యంగా రావటంలోని హాస్యాస్పద విషయాన్ని ముచ్చటించాలని శకుంతలకు లేఖ వ్రాస్తే — అనురాగం కూడా కూలిపోయిన విషయాన్ని వెలికి తీయించి "నీ కుర్చీ మూడో కాలూ విరిగింది" అని ఆమె వచ్చి అతనికి చెప్పినట్లయింది.

అతని బాధ వ్యక్తం చేయకుండానే ఆమె గ్రహించడం, పైగా అతనికి తెలియకుండానే తన పైకి వరిగిన వ్యథను చూపించటం వల్ల అతని కేదో చికాకుగా వుంది. హృదయం బరువెక్కింది.

అతనికన్నా శకుంతలే అదృష్టవంతురాలని పించింది. అనురాగ భాగ్యం లభించింది గదా ఆమెకు!

"నేనే ముందే చూస్తున్నాను."

మనసు ఆలోచనా రహితంగా, శూన్యంగా వట్టిపోయింది. రెండు మోకాళ్ళమీద గడ్డం ఆన్చి కూర్చున్నాడు శ్రీనివాస్ ఎక్కడో చూస్తూ—

నల్లని పొగ పొరలు చీకటి పరుచుకుంది. ఆ మంచు వెనుక గొలుసు నీడలాగావుంది లాంతరు వెలుగు.

"ఏమి ఆలోచిస్తున్నావ్?" వచ్చింది శకుంతల ఎప్పుడొచ్చిందో —

"ఏమీ లేదు."

"ఉంది. నాకు చెప్పటంలేదు. నేను నీకన్నా అదృష్టవంతురాలి ననుకుంటున్నావు. అందుకనే అసూయ నామీద కోపం అందుకనే" అనేసింది. అతని మనసు ఎలా పసిగట్టింది శకుంతల! మనసులో మాటల్ని పైకే అనేశాడా?

'ఏమో!

"సుశీల మాటలన్నీ కిటికీ దగ్గరుండి విన్నావని 'విన్నా' చెప్పాడు" అన్నది జాలిగా.

క్షణం కంపించాడు.

"ఇనిదరకన్నావు - అనురాగమైనా మనయిద్దరికీ మిగిలిందనుకున్నాను. అదికూడా పోయిందనేగా దిగులు."

ఆశ్చర్యపోయింది శ్రీనివాస్‌కు.

మళ్ళీ పది క్షణాలు నిశబ్దం.

"యిందాక ఏమి ఆలోచించావో చెప్పు. నేను వాకిటిలోనుండి చూశాను. నీ ముఖం చాలా భయంకరంగామారి కనులు నిప్పులు చెరిగినట్లున్నాయి కానేవు ఏమనుకొన్నావు - చెప్పవా?" స్నేహార్ద్ర కంఠం హృదయాన్ని ప్రేమతో తట్టినట్లు వినిపించాయి మాటలు.

"సుశీలను అప్పుడే పొలం అమ్మించి డబ్బు తీసికొని రమ్మని పుట్టింటికి పంపిస్తే బాగుండేదేమోనని"-

"అదీ గుడ్డితనమే అవుతుందేమో! బిడ్డను తరిమేశావని తన మనసులోని వగలు తండ్రులు. ఎందాలకే దిగుతారు." అన్నది.

ఆమె మాటలూ నిజమే ననిపించాయి. ఏదో గడిచిపోయాక అనుకొంటాము. చేతులు కాలిందే ఆకులు గుర్తుకొస్తాయి—సమయ స్ఫూర్తిలేని బుర్రల పుణ్యం — పుట్టెడు అగచాట్లు - పట్టెడు విస్తార్లు.

మరునాడు శకుంతల వెళ్ళిపోయింది. పోయేముందు శ్రీనివాసు హృదయాన్ని తట్టి ఓ నిముషం మాటాడింది

"అయితే వ్యాపారం చేయాలని లేదా?"

"లేదు వ్యాపారం చేసి సంపాదించినా - ఆ డబ్బే డబ్బును సంపాదించిన దంటారు గాని నేను సంపాదించానని అనరు. నామీద విశ్వాసం పోయింది"

నేను ఏమి చేసినా అప్రయోజకుణ్ణే. ఏదో చేసి అశాంతినే పొందటం కన్నా యిలా ఉండటమే మంచిదను కుంటున్నాను శకూ! అయితే యిది వాళ్ళందరి మీద కసితో 'అలక' చేయటం మాత్రం కాదు.

"కాదని మనం అంటాము వాళ్ళనరు. ఇదంతా అశక్తతని కూడా అంటారేమో!" అని నిట్టూర్చింది.

"ఇంకేం ఏమైనా అనుకో నాకు కొంతకాలం పనిని ... నేను చేయలేను" మూల్గాడు శ్రీనివాస రావు

అప్పుడు స్త్రీకి కొంచెం హృదయమనేది ఉంటుంది కాబోలు. పైగా భార్య అనురాగాన్ని కూడా కోల్పోయాను. ఇదివరకు ఆ అనురాగం ఉందనే ధైర్యం అతన్ని కొంత సంరక్షించింది. ఇప్పుడు కూడా అది మిగిలిందని అనుకోగానే ఆమె కంపించిపోయింది. ఏ మనిషైనా తన వ్యక్తిత్వం యిచ్చే నిబ్బరం చివరకు మిగలకపోయినా త్యజిస్తాననే ఆలోచనకి మనసు మెదలుగా కదిలిపోయింది. ఆ బాధతో మరో ఊహ పాములా ప్రాకి భీతి గొల్పింది. "శ్రీను ఎక్కడైనా పారిపోడు గదా" అనుకొని గబుక్కున ఉంది.

"శ్రీనూ" సంబాళించుకొన్న శకుంతల గొంతులో ఆర్ద్రత. వాత్సల్యం పొరలించి

కనులెత్తి అద్దంలోకి చూచినట్లు ఆమె ముఖంలోకి చూశాడు.

"నీకు తెలియని విషయం కాదు. అయినా ఎందుకో నీకు గుర్తు చేయాలనిపించి చెప్తున్నాను. మనిషి - ప్రయోజకత్వాన్ని రుజువు చేసుకొనేది ధనార్జనవల్ల కాదు. జీవితంనుంచి పారిపోకుండా నిలవగలగడం."

ఆమె వెళ్ళిపోయింది కాని ఆమెచివర్న చెప్పిన మాటలు మనసులో మల్లెపందిరిలా అల్లుకున్నాయి.

శకుంతల వెళ్ళి తరువాత పదిరోజులు బరువుగా దొర్లిపోయాయి. ఒకనాడు సాయంకాలం స్కూలునుండి రాగానే "వ్యాపారం చేయండి" అని ప్రారంభించింది శ్రీమతి.

"చేయను."

"ఎందుకని?"

"నా చేతకాదు"

"ఈ జీతపురాళ్ళతో ఎలా బ్రతుకుతాము?"

"ఇన్నాళ్ళు బ్రతికినట్లే"

"పిల్లలు ఎదుగుతున్నారు"

వాళ్ళకు ఆస్తి వుంది. కావాలంటే యింకా ఖర్చులు తగ్గించుకుందాము. కాఫీ మానేస్తాను. గంజి యిస్తే, సిగరెట్ అసలే మానేస్తాను. ఇస్త్రీ బట్టలవసరం లేదు.

"పుస్తెలమ్మిన చోటే కట్టెలమ్మేలాగా"

"పోని. ఎటుయినా వెళ్దాం. 'విద్యో' పూర్తయితే జీతం యింకాస్త పెరుగుతుంది.

'ఎక్కడికైనా వెళ్దాం. అదివరో యింతకన్నా హాయిగా వుంటుందనుకుంటూ మీకు?" బొంగురు పోయిందామె గొంతు.

"అప్పను"

"అయితే నేను మాయింటికి వెళ్తాను."

"మీ యిల్లా" యీ సారి షాక్ తిన్నాడు శ్రీనివాస్.

అవును. మా నాన్న మమ్మల్ని నీ కన్నా బాగా పోషించగలడు" ఏడ్చింది శ్రీమతి.

అంతేనా! తిండేనా! పోషణకోసమేనా భర్త? అసహ్యంవేసింది అతనికి.

"మంచిది"

అంతకుమించి మాటలాడాలనిపించలేదు. అసలు ఆమె ఒక శత్రువనే భావం ధ్రువపడింది.

ఆ మరునాడు ఆమె వెళ్ళిపోయింది.

అంత తేలికగా వెళ్ళిపోవడం?

ఎందుకు వచ్చిన 'అహం' అది?

ఆ తిరస్కారం పిడుగులా గుండెల్ని బద్దలు కొట్టింది.

తను చేసిన దోష మేమిటి?

వ్యాపారం చేయననడం! చేయకపోతే కొంప మునిగేదేమైనా ఉందా? లేదు. లేకపోయినా పుంది. ఆమె తండ్రి ఏదో మేలుకోరే గదా డబ్బు యిస్తున్నాడు. దానిని తిరస్కరించడం నేరం.

ఆమె తండ్రిని తను తిరస్కరించడం నేరం.

మరి తనను తిరస్కరించడం?

అది దెబ్బకు మారు వడ్డించిన దెబ్బ - అంతే - అంటే శ్రీమతి పగ సాధించాలని వెళ్ళిందా?

లేక ఈ అప్రయోజకుణ్ణి అంటిపెట్టుకుంటే ఒరిగేదేమిటని వెళ్ళిందా?

ఆధునిక జాతుల్లో స్త్రీ బలవంతుణ్ణి ఎన్నుకుంటుంది భర్తగా. ఆమె మనుగడకు మగవాని ధైర్య సాహసాలే శ్రీరామరక్ష. సొసైటీ స్త్రీకి ధనార్జనా పరుడే మంచి మగడు-అని అనుకోవాలేమో. అదాయాన్ని బట్టి ప్రేమభిక్ష వుంటుందేమో!

తనకు కలిగే ఈ ఊహల్లో ఏది సహేతుకమైనదో? ఏది కాదో?

ఏమో - అంతా బీరకాయ చిక్కులాగా తయారయింది.

ఒకనాడు వ్యాపార ప్రయత్నానికి అడ్డుకట్టలు వేసినవాళ్ళు-ఇప్పుడు వ్యాపారం చేయమని వత్తిడి తెస్తున్నారు. ఎందుకని? అంతర్యం ఏమిటి?

ఏవీ స్ఫురించలేదు శ్రీనివాసుకు.

ఇదంతా అర్థంలేని అలజడనుకున్నాడు అలసిపోయి.

రోజులు గడుస్తున్నాయి ఒకటి ... రెండు ... మూడూ ...

బహుశా ఈ విషయం తండ్రికి తెలిస్తే "నే ననలా! వాడు అప్రయోజకుడు - పొరపాటున పెళ్ళిచేశాము" అని అంటాడనుకున్నాడు శ్రీనివాస్. పోలంకూడా పిల్లల పేర తండ్రి వ్రాసేస్తాడేమోనని అనుకున్నాడు —

శ్రీనివాసిప్పుడు వ్యాపారం చేయాలా? భార్యను ప్లీజ్ చేయడంకోసంగానే వ్యాపారం చేయాలా! ఆ వ్యాపారంలో ఏదో వనరుతప్పి నష్టంవస్తది. ఆనాడు అతన్నేమంటారు? అప్పుడు ఈ శ్రీమతి పిల్లల్ని తీసుకొని మళ్ళీ పుట్టింటికి ఉరక్కుండా వుంటుందా!

అతని హృదయాన్ని కాల్చే సమస్యలు —

శకుంతల్నికూడా పిలవడిప్పుడు. బాధలు ఆమెకు చెప్పాలనిపించడంలేదు. ఎందువల్లనో? బహుశా చెప్పకుండానే ఆమె అతణ్ణి చదువుకోగలదని పించిందేమో. లేక వాటి వత్తిడికి అలవాటు పడటాన బరువనిపించడంలేదో ఏమో, కొంత స్తబ్దంగా వుండగలుగుతున్నాడు.

అనుకోకుండా ఒక మిత్రుని కూతురి వివాహంలో శకుంతల భర్త శ్రీనివాసును కలుసుకొన్నాడు.

మళ్ళీ శ్రీనివాసు తన హృదయవేదనన్ను వ్యక్తీకరించుకునే అవకాశం చిక్కింది — మిత్రుడు కదిపి చెప్పించుకొన్నాడు.

అంతా విన్నాడు. నవ్వాడు. "ఆశ్చర్యంకన్నా నీ ముఖంలో యిప్పుడు కాంతి కళకళ లాడుతుంది" అని ధృవం పట్టాడు.

విస్మయపడ్డాడు శ్రీనివాస్. తన ముఖంలో కొత్త కాంతి ఉందా? మిత్రుని మాటలు అర్థం కాలేదు.

"నీవిప్పుడు వ్యాపారం చేయలేవు అన్నాడు?"

"ఎందుకని?"

పసివానిలా అడిగాడు శ్రీనివాస్.

"ఆన్సర్ నీవు చెప్పుకోలేకపోవచ్చు. కాని నీ అన్ కాన్షెస్‌లో అది సిద్ధంగానే వుంది వుంటుంది ...అందువల్లే కొత్త కాంతి నీముఖంలో విరిసింది" అన్నాడు.

గారడీవాని పనులద్భుతంగా తోచి హృదయాన్ని గంతులేయించినట్లు మిత్రుని మాటలు శ్రీనివాసును 'వండర్' చేసేస్తున్నాయి.

"నాకు తెలియనిది — నాలో వుందంటావా?"

"అహ!"

"ఏమిటది?"

"నీ విరిగిన కుర్చీ స్థానే మరో మంచికుర్చీ దొరికింది-"

ప్రశ్న అర్థమవని పరీక్ష హాలులోని విద్యార్థిలా దిగాలుపడి చెమట తుడుచుకుంటూ కూర్చున్నాడు శ్రీనివాస్.

కొత్తకుర్చీ ఏమిటో- ఆ సంకేతంతో ఏది అన్వయించుకోవాలో తోచక-

పాతకుర్చీని ప్రతుకుతో పోల్చుకొన్నాడు. తండ్రిని, మామని రెండుకాళ్ళుగా ఊహించుకున్నాడు. మిగతా రెండుకాళ్ళు తనూ, సుశీల-అని అనుకున్నాడు. సుశీలా దూరమయింది. కాలు విరిగిన కుర్చీకూడా తన జీవితాన్ని సరిపోలివుందని లోగడ అనుకోవడం-మరి ఈ కొత్త కుర్చీ ఏమిటి?

"అర్థం కాలేదా?" ప్రశ్నించాడు మందహాసంతో.

"కాలేదు."

"అయితే ప్రశ్నలడుగుతాను జవాబు చెప్పు. కొత్త కుర్చీ కథ వచ్చేస్తది" అన్నాడు

"అడుగూ"

"ఎందుకు వ్యాపారం చేయాలనుకున్నావు?"

"జీవన గమనం సుగమం చేసుకోవాలని"

"కాదు - నిన్ను 'అప్రయోజకుడు' అనే వారి నోరు మూయించాలని-అంటే వ్యాపారంతో డబ్బు సంపాదించి, మీ మామ వాళ్లు మెచ్చుకొనే సుబ్బారావు లాంటి వ్యక్తులకన్నా గొప్పవాడవని రుజువు చేసుకోవడం కోసం - దానిని సాగనివ్వలేదు. మీ తండ్రీ-మామ. నీ ఊహల కుర్చీకి రెండు కాళ్లు-అవి దెబ్బతిన్నాయి — అలా ఎందు కనుకున్నావంటావు. అది సరి కాదంటావు. కాని అది సరయినదే. నీ జీవన గమనాన్ని సుగమం చేసుకోవడం ముఖ్యమని నీవనుకున్నట్లయితే నీ స్వగ్రామంలో ఉద్యోగం వదిలేవాడివి కాదు. ఆ భూమిలోనుంచే అదనపు ఫలసాయం తీయాలనే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. కాని నీవా ప్రయత్నం చేయలేదు. ఆ విధంగా అభివృద్ధి సాధిస్తే నీ ప్రయోజకత్వం అంత బాగా వ్యక్తం కాదను కోవడం వల్లే వ్యాపారం మీదికి నీ మనసుపోయి వుంటుందన్నాడు.

మౌనంగా వింటున్నాడు శ్రీనివాస్. అలాంటి భావప్రేరణ తనలో అవ్యక్తంగా వుండే వుంటుందేమో ననుకున్నాడు.

"తండ్రి, మామా వ్యతిరేకించినా, నిన్ను సుశీల సపోర్టు చేస్తుందనే సంతృప్తితో కాలాన్ని ఈడావు. ఇంకా దిగ్గిసంపాదించి మరో విధంగా ప్రయోజకత్వాన్ని రుజువు చేసుకోవాలను కొన్నావు. కాని మధ్యలోనే సుశీల వ్యతిరేకించడంవల్ల నీ ఊహల పేక మేడ కూలింది. కాలు విరిగిన కుర్చీలా నీ అస్తిత్వం దెబ్బతిన్నది. కాని నీ మామ భూమిని అమ్మిస్తాననడంవల్ల, వ్యాపారం చేయమనడంవల్ల, తండ్రిని సుశీల బల పరచి నిన్నువదలి పుట్టింటికి పోవడంవల్ల మరొక కొత్త ఊహ మొలకెత్తే వాతావరణం ఏర్పడింది -

మామ వ్యాపారం చేయమనడం అంటే అందుకు నీవు 'సమర్థుడవే' నని అనక పోయినా అన్నట్టే అర్థంకదా? అంటే యీ చర్యవల్ల నీవు ప్రయోజకుడవే నని మామ, సుశీల అంగీకరిస్తున్నట్లు పరోక్షంగా వ్యక్తం కావడంలేదా? అంటూ ప్రశ్నతో క్షణం నిలిచాడు మిత్రుడు.

కొత్త భావాలతో శ్రీనివాస్ ఉక్కిరి బిక్కిరయ్యాడు.

"నేను ప్రయోజకుణ్ణే అనేభావం ఏదో స్థిరపడుతున్నది గనుక నీవిప్పుడు వ్యాపారం చేయడానికి సుముఖత చూపించవు. ఈ కొత్తభావం - కొత్త కుర్చీలో కుదురుకుంటావు. కుదురుకున్నావు-అందువల్లే కళకళ లాడుతుంది. నీ ముఖం" అన్నాడు తిరిగి.

'ఇక ఈ కొత్త కుర్చీలోనుంచి రేపటి నీ ఊహ లెలావుంటాయో చెప్పమంటావా?' అని నవ్వాడు.

చెప్పమన్నట్టు ఆ నవ్వుకు శ్రుతి కలిపాడు శ్రీనివాస్. చాలాకాలం తరువాత వెలిగించబడిన ప్రమిద మీది దీప శిఖలా వుందా నవ్వు.

"అప్పుడే నేను పొరబడ్డాను. నా పొరపాటును మన్నించు-అని మీ మామ క్షమాపణ కోరాలని - సుశీల పరుగెత్తుకొని వచ్చి కన్నీటితో నీ పాదాలు కడగాలని. నీ తండ్రి తన తప్పిదానికి నొచ్చుకొని కనీసం నిట్టూర్పైనా పుచ్చాలని - ఇదే నీ అహంకారపు హట్టహాసం" అని ముగించాడు.

"అలా నేను కాంక్షిస్తున్నానే అనుకుందాం. అది తగనిదే అంటావా?" అడిగాడు శ్రీనివాస్.

"అందులో అసభ్యమైనది ఏమీ లేదు శ్రీనూ! ఎవరో బాగుపడుతుంటే తన బిడ్డ బాగుపడాలని కలలుకంటే సరిపోదు. బిడ్డలు బాగుపడటానికి కావల్సిన వాటిని సమకూర్చడంలో సహకారాన్ని అందించడంలో ధర్మప్రియాన్ని అందించే తండ్రులైనా, మామలైనా క్షంతవ్యులుకారు. ఒక విధంగా వాళ్లు నీవన్నట్లు "పేపుగాదిలో కుక్క" వంటి వారనే అనాలి." అని వెళ్ళిపోయాడు.

శ్రీనివాసు చాలా ఆనందంగా ఇంటికి బయలు దేరాడు. బహుశా తనలోని ఆనందాన్ని వెతికి. మిత్రుడి వెలికి తీయగానే ఆ ఆనందం అంతగా పొంగుబా వాచుతుందేమో.

తీరా ఇంటికి వెళ్ళేసరికి తండ్రివసరాలో కూర్చొ న్నాడు. రెండురోజుల క్రితం వచ్చి శ్రీనివాస్. లేనందువల్ల- వియ్యంకుని ఇంటికి వెళ్ళి-తిరిగి ఆ పూట వచ్చాడు.

కళ్ళు ఎరుపెక్కి చాలా కుపితుడై వున్నట్లు తండ్రి ముఖంలోకి చూసీ చూడగానే గుర్తించాడు శ్రీనివాస్. మామ ఏమి చెప్పాడో ? శ్రీమతి ఏమి ఫిర్యాదు చేసికొన్నదో ?

హోటలు నుంచి భోజనం తెప్పించాడు.

భోజనాలు ముగిశాయి.

"ఏరా ! వ్యాపారం చేయనన్నావంట ?"

ఏమీ మాటాడలేదు శ్రీను. మిత్రుడు అచ్చువేసి పోయిన కొత్తకుర్చీ కథను గుర్తుచేసుకున్నాడు.

"నీ యిష్టమే యిష్టమన్నమాట. సరే. నీ వెలా నన్నా ఉండు. ఆ ఆస్తిమాత్రం నీకు సెంటు స్వాధీనం చేయదంలేదు. అంతా పిల్లలపేర వ్రాసివేస్తున్నాను"

అతడు అనుకున్నంతా జరగబోతుంది. మిత్రుని ఊహ తారుమారయింది. పెద్దలు పంతాలకే పోతా రని శకుంతలన్న వాక్యం కనులముందు కదిలి పోయింది.

"ఏన్నావా ? ఆ ఆస్తి పిల్లలపేరనే వ్రాయి స్తాను" తిరిగి నొక్కి పలికాడు.

"వ్రాయించు. అయినా అంతగా నొక్కి చెప్తు న్నావు. నన్నేమైనా బెదిరించాలని వచ్చావా ?" అను మన్నాడు శ్రీను.

తండ్రి అంతకన్నా ఇంకా హెచ్చు స్థాయిలోనే ఋసకొట్టాడు. అరిచాడు. చివరికి "నీవు ఎందుకూ పనికిరాని నామమాత్రపు మనిషివి" అని వెళ్ళి పోయాడు.

నామమాత్రపు మనిషి !

శ్రీను నామమాత్రపు మనిషేనా ? అతడు ఇరిగి పోయిందనుకున్న పాతకుర్చీ. అవతరించిన దను కొన్న కొత్తకుర్చీ- అంతా వట్టిభ్రమేనా ?

తాను ప్రయోజకత్వం చూపటానికే వ్యాపారం చేయాలనుకొన్నట్లు ఊహించిన మిత్రుని అభి ప్రాయం ఎంతవరకు నిజమో స్పష్టపడలేదు. సుగమంగా జీవనం సాగటానికైతే స్వగ్రామంలో ఉద్యోగంచేస్తూ, భూమిమీద ఫలసాయాన్ని ఇంకా పెంచుకోవాలని చూసేవాడవని మిత్రుడన్నమాట సరికాదేమోననిపించింది. తండ్రి హెలంవేపు తాను పోతానంటే రానిచ్చేవాడు కాదనిపిస్తుంది. చది వించాడు- దానితోనే బ్రతకమని తండ్రి అనే వాడేమో- అంతటివాడేగద తండ్రి ! తానిప్పుడు బిజినెస్ చేయననడానికి వేరే బలమైన కారణమూ కనపడలేదు. తండ్రిమీద, మామమీద, శ్రీమతిమీద ఏర్పడిన కసేనేమో. ఆ కసే అశాంతిని. అయి ష్టాన్ని కల్పించిందేమో ?

అయితే కసి ఎందుకు ? కసిగాక ఏమివుంటది? అతడి దైన్యానికి, మానసిక వ్యధలకూ ఎవరూ కారకులు. ఏ పిశాచో, గ్రహపాటో కాదే- తండ్రి, మామ, భార్య- ఎవరు వాళ్ళంతా ?... ఏమౌతారు. వాళ్ళేమీ శత్రువర్గం కాదే. మరి ఎందుకలా కన్నీ టిని పండించారు... అజ్ఞానం. అపోహ- ఏవో అర్థంలేని నమ్మకాలు...

— అని అతడనుకుంటున్నాడు- అందుకనే వాళ్ళంటే కసి, అసహ్యం, అనాదరణ, అనా త్మీయత.

అయినా- అసలు మామ వ్యాపారం చేయమని ఎందుకు వత్తిడిచేస్తున్నాడో ? తండ్రి వియ్యం కుని మాటనే ఎందుకు సపోర్టు చేస్తున్నాడు ? తండ్రి ప్రోత్సహించటానే సుశీల అంత అమర్యాద కరంగా ప్రవర్తించటానికి పోయిందేమో ? యింతకీ మామకు ఏ సుబ్బారావు లాంటి వాడో ఒకడు బిజి నెస్ చేసి పైకి వచ్చినట్లు తెలిసి యీ 'యాం బిషన్'ని పెంచుకున్నాడా ? ఏమో తెలియలేదు. కాలచక్రం ఆగలేదు-తిరుగుతుంది-ఏది ఆగినా అది ఆగదు.

* * *

తాజా కలం :—

శ్రీనివాసు మామకు అభిప్రాయం మారడానికి కారణం ఏందో శకుంతల కనుగొని లేఖ వ్రాసింది. మామకొకమిత్రుడున్నాడు. అతని సలహా తోనే బిడ్డకు చదువుకొన్న సంబంధం కావాలని అభిప్రాయపడి, ఆస్తిమంతుడున్నా-కాదని, శ్రీని వాసుకు యిచ్చి పెళ్ళి చేశాడట. అతని సంపా దించే వ్యాపారం పెట్టనీయలేదట. కాని ఆ మిత్రుని అభిప్రాయాలు మారాయట — ఒకప్పుడు చదువులన్నా, ఉద్యోగాలన్నా విలువ వుందిగాని. యిప్పుడు వ్యాపారాలంతే- అంతే డబ్బు గడించగల వానికే విలువన్నాడట. వ్యాపారం మంచి వృత్తి న్నాడట. దానితో మామ మారిపోయాడుట.

ఆ పుత్తరం చదువుకొని శ్రీనివాసు పిచ్చివా నిలా నవ్వుకున్నాడు.

"తలలు లేవు - ఆస్తులు తప్ప. మనుష్యులు ఎదిగారే గాని, వీళ్ళ మనసులు ఎదగలేదు. తన అభిమాన సినిమాహీరో మీసం కొత్తరకంగా కత్తి రిస్తే అలా కత్తిరించే యువకుల్లాగా. ఎవడోగుండు చేయించు కొంటే గుండు చేయించుకొనే కోవకు చెందిన మనిషన్న మాట-మా మామ ! ! అసహ్యం వేస్తుంది. ఎవడో వీళ్ళకు గురి కుదిరినవాడి భావా లకు దాసులు. వాడి అభిప్రాయాల చేతుల్లోని కీలు బొమ్మలు...ఎందుకా వాజమ్మల గురించి యింకా వుత్తరాలు ..."

— అని శకుంతలకు ఓ లేఖ వ్రాసేసి-తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు శ్రీనివాసరావు.

ప్రయోజకుడంటే ఎవరూ ? అని శ్రీనుమ ప్రశ్నిస్తే శకుంతల అన్న మాటల్నే "జీవితంనుంచి పారిపోనివాడు" అని అంటాడు — అంతేగాని "ధనార్జన పరుడు" అని అనడు. అతడు దుఃఖోప శమనంకోసం తన బాధల్ని ఆ పులతో చెప్తాడేగాని సింపతీ కోసంకాదు. సింపతీకోసం ప్రాకులాడేవాడే అయినట్లయితే బహుశా శ్రీనివాసరావు గడ్డాలు. మీసాలు పెంచేవాడు. ఉద్యోగాన్ని తుంగలో తొక్కేవాడు. బి. ఎ. పరీక్షను విస్మరించేవాడు. ఇరిగిన కుర్చీని మూలకు వేసేవాడుకాదు. దానికి ఏ సులక తాళ్ళోకట్టి నేలకుబదులు దానిమీదే విషాద కావ్యంలోని హీరోలాగా కూలబడి వుండేవాడు. ఆ కుర్చీతో రాజీ పడలేదు-తన్నేశాడు. అదే అతని వ్యక్తిత్వానికి గీటురాయి.

విరిగిన కుర్చీ లేదిప్పుడు - కొత్త కుర్చీలేదు- స్కూల్లోకుర్చీని మాత్రమే ఉంచేసుకొన్నట్లున్నాడు- బి.ఎ.ను పూర్తిచేసుకొనే ప్రయత్నంలో మునిగి పోయిన శ్రీనివాసరావు బహుశా ఆ తండ్రికి బిడ్డ అనిపించుకొన్న సుశీలదృష్టిలో అప్రయోజకుడేనో- ప్రయోజకుడే అవుతాడో మీరే చెప్పాలి. ✱

